రోడ్డుపై నీటిని తొలిగించిన అధికారులు

నిలిచిన నీటిని తొలిగిస్తున్న సిబ్బంది

కొల్చారం, సెప్టెంబర్ 30: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మండల పర్యటన సందర్భంగా 'ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా? శీర్షికన సోమవారం నమస్తే తెలంగాణ పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని పోతాన్‌శెట్టిపల్లి చౌరాస్తాలో ఏడపాయల కమాన్ వద్ద నర్సాపూర్ డీఈ నాగరాజు వచ్చి రోడ్డుపై నిలిచిన నీటిని జేసీబీ సహాయంతో తొలిగించారు. సమస్య పరిష్కారానికి 60 మీటర్ల మేర డ్రైనేజీతో కూడిన కల్వర్టు నిర్మించాల్సి వస్తుందని అన్నారు.

డీఎస్సీ - 24 సర్టిఫికెట్ల పరిశీలన

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 30: జిల్లాలో డీఎస్సీ 2024 ద్వారా ఎంపికైన అభ్యర్థులకు 1 నుంచి 4వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సర్టిఫికెట్లు పరిశీలించనున్నట్లు డీఈవో రాధాకిషన్ సోమవారం తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరిశీస్తారన్నారు. 1న ఎస్‌జీటీలకు, 2 నుంచి 4వ తేదీ వరకు అన్ని సబ్జెక్టులను పరిశీలన చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సబ్జెక్టుకు 1:3 నిష్పత్తితో అభ్యర్థులను పిలువనున్నట్లు తెలిపారు. వివరాలకు వెబ్‌సైట్ www.medakdeo.comలో పరిశీలించాలని సూచించారు. పరిశీలనకు వచ్చే సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ సెట్ వెంట తీసుకుని రావాలని తెలిపారు.

ఒకే గ్రామం నుంచి ముగ్గురికి కొలువు

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 30: మండలంలోని శాలిపేటకు చెందిన ముగ్గురు అభ్యర్థులు డీఎస్సీలో కొలువు సాధించారు. జాబితాలో రామకృష్ణ, మలే రవీందర్, శ్రీనివాస్ టీచర్ పోస్టులకు ఎంపికయ్యారు. అందరిదీ వ్యవసాయ కుటుంబమే. జిల్లా స్థాయిలో రవీందర్ 2వ ర్యాంకు రామకృష్ణ 4వర్యాంకు, శ్రీనివాస్ 21వ ర్యాంకు సాధించారు. ఒకే గ్రామం నుండి ముగ్గురికి ఉపాధ్యాయుల కొలువులు రావడంతో గ్రామస్తులు అభినందించారు

నరేందర్‌కు 2వ ర్యాంకు..

రామాయంపేట, చేగుంట, సెప్టెంబర్ 30: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాలలో చేగుంట మండలం కిష్టాపూర్‌కు చెందిన అక్కల నరేందర్ మ్యాథ్స్‌లో రెండో ర్యాంకు సాధించాడు. ఆయన చేగుంటలో వనరుల కేంద్రంలో ఎంఐఎస్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

కరెంట్ షాక్ తో వ్యక్తి మృతి

కొల్చారం, సెప్టెంబర్ 30: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొల్చారం గ్రామానికి చెందిన నీరడి రాములు(52) పాలు పిండుదామని పశువుల కొట్టంలోకి వెళ్లాడు. కొట్టంలో బల్బు వెలగలేదు. దీంతో సరిచేద్దామని కరెంట్ వైర్ పట్టుకోవడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య మైసమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై గౌస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం బాగుంటుందా ?

శివ్వంపేట, సెప్టెంబర్ 30: బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి సూచించారు. మండలంలోని దంతాన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పిల్లలూ బాగా చదువుతున్నారా..? మధ్యాహ్న భోజనం ఎలా ఉంది? రాగి జావా ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించి, పలు సూచనలు నమోదు చేసి ఆమె సంతకం చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. టీచర్లు సత్యం, కవితను సన్మానించారు. మాజీ ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కన్నారం దుర్గేష్, దుర్గం రమేష్, సదానందం, పెంటాగౌడ్, సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

దంతాన్ పల్లి లో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

సీఎంఆర్ఎఫ్‌తో ఆర్థిక భీమా ..

శివ్వంపేట, సెప్టెంబర్ 30: ఆయా దవాఖానల్లో వైద్యం చేయించుకుంటూ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న బాధితులకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసానిస్తున్నదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చండి, సికింద్లాపూర్, దంతాన్‌పల్లి, గోమారం, గుండ్లపల్లి, కొంతాన్‌పల్లి గ్రామాల్లో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రగౌడ్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, ఉమాఅనిల్ ప్రసాద్‌రెడ్డి, కన్నారం దుర్గేశ్, మాజీ ఎంపీటీసీ ఇందిరా శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యాదగౌడ్, దుర్గం రమేష్, నర్సింలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

శివ్వంపేట, సెప్టెంబర్ 30: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఉసిరికపల్లి బీఆర్ఎస్ నాయకుడు మర్రి వీరారెడ్డి తల్లి అనసూయమ్మ మృతి చెందింది. వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం చండి గ్రామంలో రోడ్డు ప్రమాదానికి గురైన కుమ్మరి గోపాల్‌ను పరామర్శించి, అండగా ఉంటానన్నారు. రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు తండ్రి వెంకటరావు మొదటి వర్ధంతికి హాజరై, నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, బిఆర్‌టీయూ జల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు వీరేశం, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కన్నారం దుర్గేశ్, బాబురావు, మాజీ ఎంపీటీసీలు మర్రి సత్తిరెడ్డి, ఇందిరా శ్రీనివాస్, నాయకులు కృష్ణారావు, మహేందర్‌రెడ్డి, ఆంజనేయులు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

బతుకమ్మ సంబురాలు

రామాయంపేటలో బతుకమ్మలు ఆడుతున్న మహిళలు

కౌడిపల్లిలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు

బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చర్చ లేకుండానే ముగిసిన సమావేశం

తూప్రాన్, సెప్టెంబర్ 30: తూప్రాన్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం ఆగమాగంగా ముగిసింది. ఎలాంటి చర్చ లేకుండా పది నిమిషాల్లో ముగించి, పలాయనం చిత్తగించారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు సోమవారం ఆందోళన వ్యక్తంచేశారు. 1వ వార్డు కౌన్సిలర్ బొంది రాఘవేందర్‌గౌడ్ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి కౌన్సిలర్లంతా రాక ముందే చైర్‌పర్సన్ జ్యోతి సమావేశాన్ని ప్రారంభించారని, బీఆర్ఎస్‌కు కౌన్సిలర్లు వస్తున్నారని పది నిమిషాల్లో హడావిడిగా ముగించారన్నారు. సంతకాలు చేసే ఎజెండా బుక్ అందుబాటులో లేకుండా చేశారన్నారు. ఇందుకు నియోజకవర్గ బాధ్యుడు నర్సారెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు సమావేశ మందిరంలో ఆందోళన చేశారు. ఈ విషయమై తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినోద్దీన్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.



ఆందోళన చేస్తున్న కౌన్సిలర్లు

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో డిగ్రీ విద్యార్థి ప్రతిభ

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 30: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి కార్తీక్ బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ తెలిపారు. నిజామాబాద్‌లో సెప్టెంబర్ 30న జరిగిన పోటీల్లో సీనియర్ రిథమిక్ ఫెయిర్ విభాగంలో బంగారు పతకం, ఆర్టిస్టిక్ విభాగంలో రజత పతకం సాధించాడని పేర్కొన్నారు. త్వరలో బెంగళూరులో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్తీక్‌ను సత్కరించారు. రాష్ట్రస్థాయి యోగ పోటీల్లో మెదక్ గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు అరుణబాయి, ఉమేశ్వరి రజత పతకాలు సాధించారు. ప్రిన్సిపాల్ ఉమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, పీడీ రంగీలా, అధ్యాపకురాళ్లు విద్యార్థినులను అభినందించారు.

కార్తీక్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, అధ్యాపకులు

డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 30: డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. సోమవారం డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాలలో తాగు నీటి సౌకర్యార్థం ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తానన్నారు. కళాశాల సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కళాశాల రోడ్డును ఆధునీకరిస్తానన్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థినులు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే వెంటనే డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సు నడపాలని ఆదేశించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఎమ్మెల్యేకు సన్మానించారు.

మాదిగలను గుండెల్లో పెట్టుకుంటాం..

పాపన్నపేట: మాదిగ, మాదిగ ఉపకులాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని, వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని ఎమ్మెల్యే రోహిత్‌రావు తెలిపారు. సోమవారం మండలంలోని కొత్తపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకుడు అల్లారం రత్నయ్య ఆధ్వర్యంలో మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, త్యార్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు రూ.4 వేల పింఛన్ ఇవ్వాలి

దివంగత సీతారాం ఏచూరికి ఘనంగా నివాళులు

రామాయంపేట, సెప్టెంబర్ 30: బీడీ కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నెలకు రూ.4వేల పింఛన్ ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. సోమవారం రామాయంపేటలో జిల్లా సీపీఎం మహాసభల్లో సీపీఎం జెండావిష్కరించి, దివంగత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లేశం మాట్లాడుతూ పింఛన్లతో పాటు నెలలో 30 రోజులు పనులు కల్పించాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం, రుణ మాఫీని అందజేయాలన్నారు. సమావేశంలో బాబులక్ష్మి, నరసయ్య, బాలమణి, అజయ్, ప్రమీల, మహేందర్, రమేశ్ పాల్గొన్నారు. రామాయంపేట ఏరియా కమిటీ సీపీఎం కార్యదర్శిగా బాలమణిని నియమించారు.

ఘనంగా ఏకలవ్య జయంతి

నిజాంపేట, సెప్టెంబర్ 30: నిజాంపేటలోని బస్టాప్ వద్ద ఎరుకల సంఘం మండల సభ్యులు ఏకలవ్య జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం జెండాను ఆవిష్కరించి ఏకలవ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్, కోశాధికారి ఎల్లయ్య, నిజాంపేట అధ్యక్షుడు నర్సింహులు, సభ్యులు పోచయ్య, నర్సింహులు, సోని ఉన్నారు.

అన్ని రంగాల్లో మెదక్ సొసైటీ అభివృద్ధి

మెదక్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): అన్ని రంగాల్లో మెదక్ సొసైటీని అభివృద్ధి చేశామని పీఏసీఎస్ చైర్మన్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం మెదక్ సొసైటీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్ సొసైటీని జిల్లాలోనే నంబర్ వన్ స్థానంలో ఉంచామన్నారు. సొసైటీ పరిధిలో ప్రతీ సీజన్‌లో 52 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. విత్తనాలు అమ్మడంలో టాప్ 5లో ఉందన్నారు. రూ.7 కోట్ల డిపాజిట్‌తో టాప్ 5లో ఉందన్నారు. పేరూరులో 5 షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నామన్నారు. రాజ్‌పల్లి, ర్యాలమడుగులో గోదాంలు నిర్మిస్తున్నామన్నారు. సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ కాస సూర్యతేజ, డైరెక్టర్లు సత్యవర్ధన్‌రావు, శంకర్, సిద్ధిరాములు, గట్టయ్య, విజయ్, పెంటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ హన్మంతరెడ్డి

లాభాల బాటలో వెల్దుర్తి సొసైటీ

వెల్దుర్తి, సెప్టెంబర్ 30: ఉమ్మడి జిల్లాలోనే లాభాల బాటలో వెల్దుర్తి సొసైటీ ఉందని చైర్మన్ అనంతరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సొసైటీ అర్ధ వార్షిక మహాజన సభ నిర్వహించారు. ఆరు నెలల లావాదేవీల గురించి సీఈవో సిద్ధయ్య సభ్యులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా చైర్మన్ అనంతరెడ్డి మాట్లాడుతూ సొసైటీలో రుణమాఫీకి 1702 మంది రైతులు అర్హులు ఉన్నారన్నారు. అందులో 1063 మందికి మాత్రమే రుణ మాఫీ అయ్యిందన్నారు. వెల్దుర్తి సొసైటీ రూ.2కోట్ల 55లక్షల 61వేల 560 లాభాలు గడించి ఉమ్మడి జిల్లాలో ప్రథమస్థానంలో ఉందన్నారు. ఇప్పటి వరకు 85 మంది రైతులకు రూ.62 లక్షలు రుణాలిచ్చినట్లు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన సముదాయాల్లో 3 దుకాణాలు మాత్రమే అద్దెకు తీసుకున్నారని, మిగిలిన ఏడు దుకాణాలు ఖాళీగా ఉన్నాయన్నారు. డైరెక్టర్లు పోతిరెడ్డి, నర్సింలు, కిష్టాగౌడ్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించాలి

బోరు నీటిని తీసుకొస్తున్న తండావాసులు

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 30: వారం రోజులుగా మెదక్‌లోని పలు ప్రాంతాల్లో నీరు రావడం లేదని, పట్టణవాసులకు సమాధానం చెప్పలేకపోతున్నామని మున్సిపల్ ఉపాధ్యక్షుడుక మల్లికార్జున్‌గౌడ్, పురపాలక సభ్యులు డీఈఈ మహేశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చంద్రపాల్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు నీటిని సరఫరా చేసే 50 హెచ్‌పీల సామర్థ్యం కలిగిన రూ.2లక్షల మోటర్‌కు రూ.లక్షలతో మరమ్మతు చేయిస్తారా అని డీఈఈని ప్రశ్నించారు. పంపు హౌజ్ వద్ద నీటిని సరఫరా చేసే మోటర్ కాలిపోయిందని డీఈఈ మహేశ్ తెలిపారు. గత నెలలోనే రూ.50 వేలు పెట్టి మరమ్మతులు చేయించామని, ఈ నెల రూ.లక్ష ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. విద్యుత్ దీపాల కోసం రూ.లక్షలు ఖర్చు చేసి అద్దెకు తెస్తున్నారు. దీంతో కొత్తవి వచ్చేవి కదా అన్నారు. ప్రజాధనం వృథా చేస్తున్నారని మండిపడ్డారు. పట్టణంలోని రెవెన్యూ సమస్యలను ఎంఆర్వో లక్ష్మణ్‌బాబు దృష్టికి తెచ్చారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

బద్రియ తండాలో..

చిలిపిచెడ్, సెప్టెంబర్ 30: మండలంలోని బద్రియ తండాలో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. తాగు నీటి కోసం వ్యవసాయ బోరు బావులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొన్నది. వారం రోజుల నుంచి తండాలో నీరు రాకపోవడంతో వాటర్ ట్యాంకర్ ద్వారా నీరు అందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌడిపల్లి, సెప్టెంబర్ 30: కౌడిపల్లి, చిలిపిచెడ్, కొల్చారం మండలాలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జేఈ కోటేశ్వరరావు, లైన్‌మెన్ శివ తెలిపారు. కౌడిపల్లిలోని 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

బతుకమ్మ సంబురాలు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 30: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి, ఆడిపాడారు. అధ్యాపకురాళ్లు శ్రీలత, సుధారాణి, హరిత, నిదర్శిని, అరుంధతి, సంధ్యశ్రీ పాల్గొన్నారు.

పంటలు సాగుచేయాలి

చిలిపిచెడ్, సెప్టెంబర్ 30: పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని ఏరువాక కేంద్రం శాస్త్రవేతలు రాహుల్, సరిత తెలిపారు. సోమవారం గౌతాపూర్‌లోని ఏరువాక కేంద్రంలో విద్యార్థులు, రైతులు, ప్రజలకు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సు ఏర్పాటుచేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వనరులపై గ్రామ రూపు రేఖ మ్యాప్ వేసి అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ స్వరూపావితల్, దినేశ్‌రెడ్డి, చంద్రు, శ్రావణ్, మణి పాల్గొన్నారు.

బాధ్యతగా మెలగాలి

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 30: పోలీసులు ప్రజల పట్ల బాధ్యతగా మెలగాలని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా బ్లూ కోట్స్, పెట్రో కార్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బ్లూకోట్స్, పెట్రో కార్ సిబ్బందికి 27/7 ప్రజలతో ఉంటారన్నారు. డయల్ 100 గాని ప్రజల వద్ద నుంచి ఏదైనా అత్యవసర ఫోన్ కాల్ వచ్చినప్పుడు పోలీస్ పెట్రో కార్ డ్రైవర్లు వేగంగా స్పందించాలని తెలిపారు. సమావేశంలో ఎస్‌బీసీఐడీ సందీప్‌రెడ్డి, డీసీఆర్బీ సీఐ మధుసూదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

మెదక్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార స్వభావంపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయపు సమావేశపు హాలులో ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్జీలను పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలతో వచ్చిన ప్రజల పట్ల జవాబుదారీగా ఉండాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలు పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యటనలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. భూ సమస్యలు 25, పెన్షన్స్ 4, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు 19, ఇతర సమస్యలు-39 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామాయంపేట: రామాయంపేటలో నిర్వహించిన ప్రజావాణిలో 20 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ రజినీకు మారి తెలిపారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

బాలికల మూత్రశాలలకు టీచర్ మరమ్మతులు

మూత్రశాలను మరమ్మతులు చేస్తున్న ఉపాధ్యాయుడు

కౌడిపల్లి, సెప్టెంబర్ 30: మండలంలోని వెల్మకన్నె జడ్పీహెచ్ఎస్‌లో టీచర్ తాపీ మేస్త్రిగా, విద్యార్థులు కూలీలుగా మారి పాఠశాలలోని బాలికల టాయిలెట్స్‌ను సోమవారం మరమ్మతులు చేశారు. పాఠశాలలో 315 విద్యార్థుల్లో 98 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. అందరికీ కలిపి రెండు టాయిలెట్స్ ఉన్నాయి. అందులో ఒకటి చెడిపోయింది. బాలికలు మూత్రశాలలకు వెళ్లాలంటే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇది గమనించిన ఉపాధ్యాయుడు మరమ్మతులు చేశాడు.

నేటి నుంచి వాటర్ వర్కర్స్‌కు శిక్షణ

రామాయంపేట, సెప్టెంబర్ 30: నేటి నుంచి రామాయంపేట మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయంలో రామాయంపేట, నిజాంపేట మండలాలకు చెందిన వాటర్ వర్కర్స్‌కు ఐదు రోజులు శిక్షణ ఉంటుందని మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజినీర్ కిరణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు.

చిన్నశంకరంపేట: నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా బోరు మోటరు రిపేరు, లీకేజీలు అరికట్టడం వంటి అంశాలపై వాటర్ వర్కర్స్‌కు ఐదు రోజుల పాటు శిక్షణ తరగతులు ఉంటాయని ఎంపీడీవో దామోదర్ ప్రకటనలో తెలిపారు. 5 వ తేదీ వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు.

అడవి పందులు - కోతులపై అవగాహన

వరిపొలాన్ని పరిశీలిసున్న శాస్త్రవేత్తలు

కొల్చారం, సెప్టెంబర్ 30: మండలంలోని ఎనగండ్ల గ్రామంలో రైతులకు అడవి పందులు, కోతులపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. రైతులతో కలిసి పంటపొలాలను పరిశీలించారు. కోతులు, అడవి పందుల నుంచి పంటను రక్షించుకునేందుకు మెళకువలను వర్సిటీ సైంటిస్ట్ సునీత వివరించారు. డీఏ ఏటీటీసీ సంగుపేట్ సైంటిస్ట్ రాహుల్, కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి, ఏవో శ్వేతా కుమారి పాల్గొన్నారు.

బీవీఆర్ఐటీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

నర్సాపూర్, సెప్టెంబర్ 30: నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో ఈడీఈఎమ్ సాఫ్ట్‌వేర్ టూల్స్‌తో ఇంజినీరింగ్ స్కిల్స్‌ను మెరుగుపరచడంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించారు. కణ ప్రవర్తనను అనుకరించడం, పారిశ్రామిక ప్రక్రియలను ఆప్టిమైజ్ చేయడంలో ఈ అప్లికేషన్‌పై ఆధునికంగా అందించడం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వోడీలు పి.విష్ణు, వరుణ్, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, గౌరవ అతిథి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాహస అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 30: ఏదైనా సాహసం చేసిన విద్యార్థులు అవార్డులకు దరఖాస్తుల చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఇండియన్ కౌన్సిల్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్ వారు 18 నుంచి 24 ఏండ్లలోపు వయస్సు గల యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 30: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని మహిళా డిగ్రీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి అన్నారు. సోమవారం పట్టణంలోని రైల్వే స్టేషన్, ఇందిరాగాంధీ స్టేడియం రోడ్లు, తహసీల్ కార్యాలయ ప్రాంతాలలో చెత్తాచెదారాన్ని తొలిగించారు.

రెడ్డిపల్లిలో ఆరోగ్య శిబిరం

నర్సాపూర్, సెప్టెంబర్ 30: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో మాజీ ఉపసర్పంచ